**స్థానిక సంస్థల బలోపేతం సిపిఎం ఎజెండా**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు**

**ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలను అరికట్టాలి**

**ఏకగ్రీవాలే అక్రమాలకు నిదర్శనం**

**సిపిఎంకు ఎవరితో పొత్తు లేదు**

**స్థానిక సంస్థల ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలకు పాల్పడిందని, ప్రతిపక్షపార్టీలను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకుంటోందని, అదే సమయంలో సిపిఎం స్థానిక సంస్థల బలోపేతమే ఎజెండాగా బరిలో దిగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. శనివారం విజయవాడ ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావుతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళిక విడుదల చేశారు. ప్రతిపక్షాల వారి నామినేషన్ల పేపర్లను చించేయడం, దానికి పోలీసులూ సహకరించడం విస్తారంగా జరిగినట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికలు అపహాస్యం అవుతున్నాయని అన్నారు. పంచాయతీల, మున్సిపాలిటీల నిధులు, విధులు ఈ కాలంలో కోతకు గురవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో స్థానిక సంస్థల పాత్ర నిర్వీర్యమవుతోందని తెలిపారు. సిఆర్‌డిఎ లాంటి వ్యవస్థలు వచ్చిన తరువాత స్థానిక సంస్థలకు ఉన్న కొద్దిపాటి అధికారాలు కూడా కోతకు గురయ్యాయన్నారు. సిఆర్‌డిఎ పరిధిలో ఎక్కడైనా భూసేకరణ చేయాలనుకుంటే స్థానిక పంచాయతీల, మున్సిపాలిటీల తీర్మానాలు చాలా అవసరమని, వారి ఆమోదం లేకుండా చేయకూడదన్న నిబంధనను తొలగించారు. అదే విధంగా వ్యవసాయ భూమిని, నివాస స్థలాలుగా మార్చాలంటే చెల్లించే డబ్బంతా సంబంధిత పంచాయతీ లేక మున్సిపాలిటీకే రావాలి. కానీ ప్రస్తుతం ఆ డబ్బును రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకుంటోందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ డబ్బును కేంద్ర ప్రభుత్వం తీసుకెళ్లి పోతోందని వివరించారు. పంచాయతీలు, మున్సిపాలిటీల డబ్బును రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం డబ్బును కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి రూపంలో విపరీతంగా లాగేస్తోందన్నారు. దీంతో స్థానిక సంస్థల ఆదాయాలు కుదించబడ్డాయని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం సిఆర్‌డిఎ పరిధితో స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేస్తే, దీన్ని సవరించేందుకు వైసిపి ఏ విధమైన చర్యలూ చేపట్టలేదని తెలిపారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాన్ని పూర్తిగా బలహీనం చేయడం కోసం, ప్రతిపక్ష నాయకుల నామినేషన్ల పత్రాలు పోలీసుల మద్దతుతో అధికార పార్టీ నేతలు లాగేసుకుని నామినేషన్లను అపహాస్యం చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని మీడియా వెలుగులోకి తెచ్చిందన్నారు. ఎక్కడైతే నామినేషన్ల పత్రాలను అధికార పార్టీ నాయకులు లాక్కున్నారో అలాంటి ప్రదేశాలన్నింటిలోనూ మళ్లీ నామినేషన్ల ప్రక్రియను చేపట్టాలని, ఎన్నికల కమిషన్ నామినేషన్లకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో చాలా విస్తారంగా ఎంపిటిసి, జెడ్‌పిటిసిలు ఏకగ్రీవంగా ఎన్నికవుతున్న తీరును చూస్తున్నామన్నారు. ఇటువంటి చర్యలతో ప్రజాస్వామ్యానికి తీవ్రమైన విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు ఏకగ్రీవం అయినట్లు లెక్కలతోసహా వచ్చిందని, శనివారం సాయంత్రానికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయనడానికి ఇవే పెద్ద ఉదాహరణ అన్నారు. మాచర్ల వంటి కేంద్రాల్లో 31 వార్డులకు పోటీ లేకుండా ఏకగ్రీవం అవుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. రాష్ట్రంలో 93 మున్సిపాలిటీ వార్డులు ఏకగ్రీవం అవుతున్నాయని, నేటి సాయంత్రానికి ఈ సంఖ్య రెట్టింపు అయినా ఆశ్చర్యపడనక్కర్లేదన్నారు. చిత్తూరు జిల్లాలో 170 ఎంపిటిసిలు, కడపలో 96, గుంటూరులో 89 ఎంపిటిసిలు స్థానాలు ఏకగ్రీవం అయనట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ తన అధికారాలు వినియోగించి పరిస్థితులను చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నామినేషన్ల కార్యాలయంలోనే కూర్చుని నామినేషన్ల సరళిని ప్రభావితం చేశాడని తెలిసినా ఎన్నికల కమిషన్ దీనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ నిర్ణయించిందా? రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందా? అనే అనుమానం ఎన్నికల తేదీల నిర్ణయం చూస్తే కలుగుతోందన్నారు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తున్నట్లు తెలుస్తోందని, ప్రజలు దీన్ని తప్పుబడుతున్నారని వివరించారు. పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే రాష్ట్రవ్యాపతంగా నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం జరిగేది కాదని అన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగం సరళి ప్రజలు తప్పు పడుతున్నారన్నారు. కుల ధృవీకరణపత్రాలు సిఎం ఫోటోతో వస్తున్నాయని తెలిసిందని, ఇటువంటి చర్యలు మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతపురంలో 841 ఎంపిటిసిలకు 27 ఏకగ్రీవం అయ్యాయని, ఈ సంఖ్య పెరిగే ప్రమాదం ఉందన్నారు.

టిడిపి, వైసిపి దొందూ దొందే

ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను లాక్కునే విషయంలో టిడిపి, వైసిపికి ఏమాత్రం తేడాలేదని తేల్చిచెప్పారు. దీనిలో భాగంగానే గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, గుంటూరు ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంలను వైసిపిలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కెఇ ప్రభాకర్, కదిరి బాబూరావు, రామసుబ్బారెడ్డి, సతీష్ రెడ్డి(ఎమ్మెల్సీ), డొక్కా మాణిక్యవరప్రసాద్, విశాఖ నుండి రెహమాన్, విజయ్‌కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, పంచకర్ల రమేష్, అయ్యన్నపాత్రుడి సోదరుడు, బీద మస్తాన్‌రావు, పోతుల సునీత(ఎమ్మెల్సీ), శివనాగిరెడ్డి(ఎమ్మెలీ)లను చేర్చుకున్నారు. శమంతకమణి(ఎమ్మెల్సీ), యామినీ బాల చేరుతున్నట్లు తెలిసిందన్నారు. శిద్దా రాఘవరావు సోదరులంతా వైసిపిలో చేరుతున్నట్లు తాజా వదంతులు వచ్చాయని వివరించారు. పార్టీ ఫిరాయింపులను టిడిపి ఏ విధంగా ప్రోత్సహించిందో, వైసిపి అలాగే ప్రోత్సహిస్తోందన్నారు.

సరళీకరణ విధానాలతో ప్రభుత్వ సొమ్ము లూటీ

ఇటీవల కాలంలో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు వచ్చిన తర్వాత ప్రభుత్వ సొమ్మును లూటీ చేయడం పెరిగిందని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా అక్రమ వ్యాపారాలు, అక్రమ భూములు వ్యాపారం, అడ్డదారిలో కాంట్రాక్టులు సంపాదించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడం, వడ్డీ వ్యాపారాలు, రియల్‌ఎస్టేట్‌లో అక్రమంగా లే అవుట్‌లు వేయడానికి అనుమతులు పొందడం, కల్తీ విత్తనాలు, కల్తీ రసాయన ఎరువులు, కల్తీ మందులు, కల్తీ నర్సరీలు రకరకాల వ్యాపారాలు గ్రామీణ ప్రాంతాల్లో పెరిగాయన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా భూములు ఉన్నవారు ఆదాయం అధికంగా పొందేవారని, నేడు అధికార పార్టీకి సన్నిహితంగా ఉండి ఇసుక, మట్టి వ్యాపారంలాంటివి చేసే వారు అధిక ఆదాయం సంపాదిస్తున్నారని వివరించారు. విజయవాడ కార్పొరేషన్ కమ్యూనిస్టుల చేతిలో నుండి వెళ్లిపోయాక కార్పొరేటర్లు ఎమ్మెల్యేలతో సమానంగా సంపాదిస్తున్నారని వివరించారు. సంపాదన పెరిగిన నేపథ్యంలోనే స్థానిక సంస్థల ప్రాధాన్యత పెరిగిందని, అందుకే నాయకుల ఫిరాయింపులు పెరుగుతున్నాయని తెలిపారు. వైసిపి అధికారంలోకి రాకముందు ప్రకటించిన విధానాలు అధికారంలోకి వచ్చాక మారాయన్నారు.

స్వతంత్రంగా పోటీ చేస్తున్నాం

సిపిఎంకు ఎవరితోనూ పొత్తులు లేవని, స్వతంత్రంగా పోటీ చేస్తోందని స్పష్టం చేశారు. 400 పైచిలుకు ఎంపిటిసిలు, సుమారు 80 జెడ్‌పిటిసిల్లో సిపిఎం పోటీ చేస్తోందని అన్నారు. సిపిఎం ప్రణాళికను అర్థం చేసుకుని, సిపిఎం అభ్యర్థులను ఆదరించాలని, గెలిపించాలని కోరారు. అనేక నిర్బంధాలు, ఒత్తిళ్లను తట్టుకుంటూ మీడియా కూడా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో మంచి పాత్ర పోషిస్తోందని అభినందించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఎంకు కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు మధు సమాధానమిస్తూ పొత్తు లేదన్నారు.